# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 25-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారతదేశ అభివృద్ధిలో సహకార సంఘాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు.
- "హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్" పేరిట రేపటి నుండి సంవత్సరం పొడవునా వేడుకలు నిర్వహిస్తామని న్యాయ శాఖామంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ తెలిపారు.
- పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో భాగంగా ఈరోజు ఉభయ సభలు బుధవారానికి వాయిదా పడ్డాయి.
- భారత్- ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో భారత్ భారీ విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ అభివృద్ధిలో సహకార సంఘాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఐసిఎ గ్లోబల్ కో-ఆపరేటివ్ కాన్ఫరెన్స్‌ను నరేంద్ర మోడీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతదేశంలో సహకార సంఘాలు ఒక ఆలోచన నుండి ఒక ఉద్యమంగా, ఉద్యమం నుండి విప్లవంగా, విప్లవం నుండి సాధికారతగా అభివృద్ధి చెందాయన్నారు. మహిళల భాగస్వామ్యంతో నడిచే ఈ ఉద్యమం మహిళా సాధికారత దిశగా చేపట్టిన బృహత్తర ప్రయత్నమని నరేంద్ర మోడీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

1895లో స్థాపించబడిన ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ అలయన్స్ ఐసిఎ సదస్సు మొట్ట మొదటి సారిగా ఆరు రోజుల పాటూ భారత్ లో జరగనుంది. ఈరోజు జరిగిన ఈ సదస్సుకు భూటాన్ ప్రధానమంత్రి డేషో షెరింగ్ టోబ్‌గే, ఫిజీ ఉప ప్రధానమంత్రి మెనోవా కమికామికా, కేంద్ర హోం సహకార శాఖల మంత్రి అమిత్ షా కూడా హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. వీటిలో భాగంగా మొదటి రోజు అయిన ఈరోజు ఇటీవల మరణించిన ఇద్దరు పార్లమెంట్ సభ్యులు వసంతరావు చవాన్, షేక్ నూరుల్ ఇస్లామ్‌లకు లోక్‌సభలో నివాళులు అర్పించారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా గౌరవ సూచకంగా సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. మరోవైపు రాజ్యసభలో విపక్ష సభ్యులు గందరగోళం సృష్టించడంతో సభను వాయిదా వేశారు. తిరిగి 11 గంటల 45 నిమిషాలకు సమావేశమైనప్పుడు, సభను సాధారణంగా నిర్వహించడానికి అనుమతించాలని ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ విపక్ష సభ్యులను కోరారు. అయినా పరిస్తితి మెరుగవకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

(వాయిస్ 15 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

అనుకూల రుతుపవన పరిస్థితులు పెరిగిన కనీస మద్దతు ధరలతో  వ్యవసాయ రంగానికి సంబంధించి రాబోయే నెలల్లో ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఆశాజనకంగా ఉండనుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భారతదేశ ఆహార ద్రవ్యోల్బణం మరింత తగ్గే అవకాశం ఉందని ఈరోజు విడుదల చేసిన నెలవారీ ఆర్థిక సమీక్షలో పేర్కొంది. స్థిరమైన డిమాండ్ వృద్ధి, బలమైన తయారీ, సేవా రంగ కార్యకలాపాలతో అక్టోబర్ లో భారత ఆర్థిక స్థితిస్థాపకతను ఈ సమీక్ష ప్రస్తావించింది. ఉత్పాదక ఉద్యోగాలు పెరగడం, వ్యవస్థీకృత రంగాల్లోకి యువత ప్రవేశించడంతో ఉపాధి కూడా విస్తరిస్తోందని తెలిపింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, చైనాలో పరిణామాలపై ఆందోళనలు, విదేశీ పెట్టుబడిదారులు అక్టోబర్ లో భారత ఈక్విటీల నుంచి నిధులను ఉపసంహరించుకోవడానికి దారితీశాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = =

జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) పార్టీ అధ్యక్షుడు హేమంత్ సోరెన్ జార్ఖండ్ ముఖ్యమంత్రి గా నవంబర్ 28న ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిన్న ఆ రాష్ట్ర గవర్నర్ సంతోష్ కుమార్ను  కలిశారు.. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐలకు చెందిన 56 మంది శాసనసభ్యుల మద్దతు లేఖను సమర్పించినట్లు హేమంత్ సోరెన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, ఆర్జేడీ, సీపీఐ(ఎంఎల్) ఇంచార్జీలు పాల్గొన్నారు. అంతకుముందు హేమంత్ సోరెన్ తన రాజీనామా లేఖను గవర్నర్ కు సమర్పించారు. హేమంత్ సోరెన్ రాజీనామాను ఆమోదించిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

మధ్యధరా ప్రాంతంతో భారతదేశ సంబంధాన్ని బలోపేతం చేయడంలో ఎకనామిక్ కారిడార్ (IMEC) కీలకం  కానుందని భారత విదేశీ వ్యవహారాల శాఖా మంత్రి ఎస్. జయశంకర్ పేర్కొన్నారు. ఇటలీలోని రోమ్ నగరంలో ఈరోజు జరిగిన మెడిటరేనియన్ డైలాగ్స్ కాన్ఫరెన్స్ లో జయశంకర్ ప్రారంభోపన్యాసం చేశారు. కొనసాగుతున్న మధ్యప్రాచ్య వివాదం దాని ప్రాంతీయ ప్రభావాల నేపధ్యంలో భారత్ మధ్యధరా ప్రాంతం మధ్య అనుసందానం అత్యవసరమని ఆయన వ్యాఖ్యానించారు. వివాదాలను యుద్ధం ద్వారా పరిష్కరించలేమని, భారత్ బలంగా నమ్ముతోందని  జయశంకర్ మాట్లాడుతూ....

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

రాజ్యాంగాన్ని ఆమోదించి ఈ సంవత్సరంతో 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రేపటి నుండి హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్' పేరిట సంవత్సరం పొడవునా వేడుకలు నిర్వహిస్తామని న్యాయ శాఖామంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా గ్రామ, జిల్లా స్థాయిల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీలో భాగమైన 15 మంది అసాధారణ మహిళల విశేష కృషితో పాటు, రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గణనీయమైన కృషిని తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కేంద్రమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభల సభ్యులను ఉద్దేసించి చేసే ప్రసంగంతో రేపు న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనంలోని సంవిధాన్ సదన్ హాల్లో ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. కాగా 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించగా, 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చింది. 2025 నవంబర్ 26 వరకు ఈ వేడుకలు జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

నయీ చేతన 3.0 క్యాంపెయిన్ కింద 13 రాష్ట్రాల్లో 227 జెండర్ రిసోర్స్ కేంద్రాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మహిళల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశంలో లింగ ఆధారిత హింసను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ స్పందించాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80 వేల 193 లాభాల్లో ప్రారంభమై చివరికి 80 వేల 109 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 24 వేల 221.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ కాస్త బలపడి 84.30కి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2 వేల 672 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా పెర్త్ వేదికగా జరిగిన భారత్ తొలి టెస్టు మ్యాచ్లో 295 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. దీంతో ఐదు టెస్టుల సిరీస్లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. భారత్ నిర్దేశించిన 534 పరుగుల లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్లో 238 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్లో బుమ్రా 3, సిరాజ్ 3, వాషింగ్టన్ సుందర్ 2.. నితీశ్ రెడ్డి, హర్షిత్ రాణా చెరో వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా నిలిచాడు. తదుపరి మ్యాచ్ డిసెంబర్ 6న అడిలైడ్ వేదికగా జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =